క్లుప్తంగా

గడువులోగా అర్జీలను పరిష్కరించండి

ఆర్డీఓ కిశోర్



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిశోర్

కాకినాడ రూరల్: సర్వేకు సంబంధించి రెవెన్యూ పరంగా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆర్డీఓ ఈట్ల కిశోర్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మురార్జీతో కలిసి సర్వే, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. జగనన్నకి చెబుదాం, స్పందన, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష, రీ సర్వే, సంబంధించి సమీక్షించారు. ఖరీఫ్ ధాన్యంపై సమీక్షించారు.

శ్రీనగర్ సదస్సుకు కమిషనర్



కాకినాడ: కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు కాకినాడ స్మార్ట్ సిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు వెళ్లారు. గురు, శుక్రవారాల్లో జరగనున్న స్మార్ట్ సిటీల వర్క్ షాప్ ఆయన పాల్గొననున్నారు. బహిరంగ ప్రదేశాలను ప్రజలకు ప్రయోజనకరంగా సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం, సైకిల్ 4 చాలెంజ్, ఈట్ స్ట్రీట్‌ల అభివృద్ధి వంటి అంశాలపై ఈ సదస్సు జరగనుంది. ఆయా స్మార్ట్ సిటీలలో ఇప్పటికే అమలవుతున్న అభివృద్ధి పనుల పైనా, భవిష్యత్ కార్యాచరణపైనా సదస్సులో చర్చించనున్నారు.

రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలి



సీపీఎం రక్షణ భేరి యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధికి సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా రక్షణభేరి యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం కాకినాడ సుందరయ్యభవన్‌లో సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కేఎస్ శ్రీనివాస్, జి.బేబీరాణి తదితరులతో కలసి పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు కావస్తున్నా ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామయ్యపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ ఏర్పాటు వంటి ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత వంకాకు నివాళులు

కాకినాడ రూరల్: కమ్యూనిస్టు ఉద్యమ నేత, పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వంకా సత్యనారాయణకు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం నివాళులర్పించారు. వంకా సత్యనారాయణ మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారన్నారని ఆయన మనుమడు డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. తాత 5వ వర్ధంతిని పురస్కరించుకుని అడ్డాల దంపతులు పేదలకు చీరలు పంపిణీ చేశారు.

పి.మల్లవరం హైస్కూల్‌కు చేయూత



పి.మల్లవరం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న రవీంద్ర

తాళ్లరేవు: పి.మల్లవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా విశ్రాంత మేనేజర్ వుంగరాల రవీంద్ర రూ.50 వేలను బుధవారం అందజేశారు. ఈ మేరకు ఆ పాఠశాలలో హెచ్‌ఎం పాలెపు వెంకట శ్రీనివాసరావుకు చెక్కు ఇచ్చారు. ఈ నగదును తాళ్లరేవు యూనియన్ బ్యాంకులో జమ చేసి వచ్చే వడ్డీని ప్రతి ఏడాది పదో తరగతిలో 4, 5, 6 స్థానాలలో నిలిచే విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు అందజేయాలని రవీంద్ర కోరారు. కార్యక్రమంలో ఏఎస్ మూర్తి, ధూళిపూడి వెంకటరమణ, ధూళిపూడి శుభ, వుంగరాల బూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం అవ్వండి



అవగాహన సదస్సులో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

- కార్యకర్తలకు ఎమ్మెల్యే కన్నబాబు దిశానిర్దేశం
- జగనే ఎందుకు కావాలో అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 2019 ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమం అమలుపై అవగాహన కల్పించారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలా ఉంటుందని, ఒక బుక్ అందజేస్తామని అందులో ప్రజల వద్దకు వెళ్లి వారి ఫోన్ నంబరు నమోదు చేసి ప్రజల అభిప్రాయాలు సేకరించి వారిచ్చే రేటింగ్ నమోదు చేసుకోవాలన్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందుగా సచివాలయ కన్వీనర్లు, ముఖ్య నాయకులు సమావేశం కావాలని కోరారు. క్లస్టర్ కన్వీనర్లు, పార్టీ పరంగా పదవుల్లో ఉన్న వారు పాల్గొనాలని సూచించారు. బుక్‌లెట్‌లో జగన్ ఇచ్చిన హామీలు, చంద్రబాబు ఇచ్చిన హామీలను ముద్రించాని, వాటిపై ప్రజాభిప్రాయాన్ని కోరుతామన్నారు. నెరవేర్చిన వాటిని వారు టిక్కు పెట్టి సమాధానం తెలియజేస్తారన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, అర్బన్ డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి కడియాల చినబాబు, మాజీ కార్పొరేటర్లు వడ్డి మణికుమార్, ఐ.శ్రీను, అనుసూరి ప్రభాకర్, పుల్ల కోటేశ్వరరావు, చిల్లి దేవరాజు, వాసురెడ్డి సూరిబాబు, పాటి సూరిబాబు, సర్పంచ్‌లు రామదేవు చిన్నా, వలవల వెంకటేశ్వరరావు, నల్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పీఎఫ్ కార్యాలయ నిర్మాణానికి భూమిని కేటాయించండి



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న శ్రీనివాసరావు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కాకినాడ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ బసవ శ్రీనివాసరావు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నిర్మాణానికి, శిక్షణ సంస్థను నెలకొల్పడానికి జిల్లాలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్ కృతికా శుక్లాను కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమైన ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎస్‌పీఎఫ్ కీలక భూమిక పోషిస్తున్నట్లు వెల్లడించారు. ఓఎన్‌జీసీ, హెచ్‌పీహెచ్‌టి గాడిమొగ, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ గాడిమొగ, ఓఎన్‌జీసీ ఓడలరేవు. కాకినాడ పోర్టు, యూటీఐసీసీ కాకినాడ, ఓఎన్‌జీసీ ఎస్‌టీసీ కాకినాడ, అన్నవరం దేవస్థానాలకు తమ దళాలు భద్రత కల్పిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు.

నేటి నుంచి ఆర్టీసీ కార్గో వారోత్సవాలు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి నవంబర్ 25వ తేదీ వరకు నెల రోజుల పాటు కార్గో డోర్ డెలివరీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారికి పార్శిల్, కవర్లను చాలా తక్కువ సమయంలో డోర్ డెలివరీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు డోర్ డెలివరీపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. పార్శిల్/కొరియర్ ధరల వివరాలను వివరించారు. ఒక కిలోకు రూ.18లు, ఒకటి నుంచి ఆరు కిలోల వరకు రూ.30, ఆరు నుంచి పది కిలోల వరకు రూ.36లు, పది నుంచి 25 కిలోల వరకు రూ.48లు, 25 నుంచి 50 కిలోల వరకు రూ.59లు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు.

బ్లడ్‌బ్యాంకులో లిఫ్ట్ ప్రారంభం



సత్యనారాయణన్‌ను సత్కరిస్తున్న బ్లడ్‌బ్యాంక్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ బ్లడ్‌బ్యాంక్‌లో సుమారు రూ.6 లక్షలతో నూతనంగా నిర్మించిన కొత్త లిఫ్టును రోటరీ మాజీ గవర్నర్లు, ఎస్‌వీఎస్ రావు, ఎల్ సత్యనారాయణన్ బుధవారం ప్రారంభించారు. రక్తదాతలకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బ్లడ్‌బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ నిట్టాల వెంకట రామారావు తమ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా రూ. 5 లక్షలు సమకూర్చగా మిగిలినవి బ్లడ్‌బ్యాంక్ నుంచి మంజూరు చేశామన్నారు. సీఎస్సార్ నిధులు రావడానికి కృషి చేసిన రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ మాజీ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్ కృషి మరెవలేనిదన్నారు. అనంతరం ముఖ్య అతిథులను బ్లడ్ బ్యాంక్ తరఫున సత్కరించి జ్ఞాపిక అందించారు. బ్లడ్‌బ్యాంక్ కార్యదర్శి చార్మినార్ వర్మ, క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ, కార్యదర్శి చందు, సభ్యులు పాల్గొన్నారు.

సెలవుల్లో సరదాగా..

- ముగిసిన శిక్షణ శిబిరాలు
- వివిధ అంశాలపై అవగాహన కల్పించిన అధికారులు



శిక్షణ శిబిరానికి హాజరైన చిన్నారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దసరా సెలవులు వచ్చాయంటే విద్యార్థుల ఆనందానికి అవధులుండవు. ఆట పాటలతో సందడిగా గడపాలని భావిస్తారు. రోజంతా వాటితోనే సమయం వృథా చేస్తుంటారు. అలా కాకుండా విజ్ఞానం, నైపుణ్యం పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో వివిధ అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించారు. సెలవులు ఇచ్చిన పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారిలో ప్రతిభ గుర్తించారు. నగరంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు గాంధీనగర్ కుళాయిచెరువు పార్కు, అనంద భారతి గ్రౌండ్, జగన్నాథపురం గ్రంథాలయాల్లో ఈ శిక్షణలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతికథలు చెప్పించడం, తెలుగు శతక పద్యాలు, బొమ్మలు గీయడం, ఆంగ్లంపై పట్టు సాధించేందుకు మెళకువలు నేర్పించారు. పుస్తకాలు, పత్రికల పఠనం అలవాటు చేయడం, అలాగే విజేతల పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలు వివరించారు.

కొత్త విషయాలు నేర్చుకున్నాం



సెలవుల్లో ఖాళీగా తిరిగి సమయం వృథా చేసుకోవడం ఇష్టంలేక ఇక్కడికి వచ్చాం. పుస్తకాలు, పత్రికలు చదివి కొత్త విషయాలు తెలుసుకున్నాం. గ్రంథాలయంలో అన్ని అంశాలు చక్కగా వివరించారు. చిత్రలేఖనంపై ఆసక్తి ఉండటంతో వాటినీ వేశాను.

– కె.లక్ష్మీమౌనిక, కాకినాడ

నచ్చిన పుస్తకాలు చదువుకున్నాం



స్కూల్లో చదువు, హోం వర్క్ వంటి రోజువారీ కార్యక్రమాలకు భిన్నంగా శిక్షణ నిర్వహించారు. నచ్చిన పుస్తకాలు, కొత్త స్నేహితులు కలిసారు. కావలసిన అంశంపై నేర్చుకునేలా శిక్షణ ఇచ్చారు.

– పి.బంగారం, కాకినాడ

భక్తిశ్రద్ధలతో భేతాళ సంబరం



వేట్లపాలెం భేతాళ సంబరంలో భక్తులు



పీబీ దేవంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న ప్రజలు

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సామర్లకోట: వేట్లపాలెంలో ప్రసిద్ధి చెందిన భేతాళ సంబరం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి దర్శనానికి వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. గ్రామశివారు నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన భేతాళస్వామిని తిరిగి అక్కడకు తీసుకువెళ్లి పూడ్చి వేయడానికి సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామివారు తమ ఇళ్ల వద్దకు రావడంతో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి భేతాళస్వామి ఆలయం వద్ద బాణసంచా కాల్పుల పోటీలు జరిగాయి. వీటిని తిలకించడానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కమిటీ సభ్యులు కొండపల్లి సూరన్న చౌదరి, కొండపల్లి జగ్గారావు, కొండపల్లి కృష్ణమూర్తి, నున్నా వెంకట్రాజు, గోలి శ్రీరామ్, గుణ్ణం సురేష్, కొండపల్లి కొండలరావు, దేసిన బోసు తదితరులు భక్తులకు సేవలందించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పీబీ దేవంలో అన్నసమారాధన

పీబీ దేవంలోని శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా సేవా సమితి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సభ్యులు తోటకూర గంగాధర్, వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, విశ్వనాథ్, టీవీవీ సత్యనారాయణ, నువ్వుల సూర్యచంద్రరావు, తాడాల దొరబాబు, నువ్వుల బాబ్జి సేవలందించారు.

28న కాశిబాబు జలస్తంభన దీక్ష

తాళ్లరేవు: గౌతమి గోదావరిలో ఈ నెల 28న జలస్తంభన దీక్ష చేయనున్నట్లు పిల్లంక గ్రామానికి చెందిన వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వరశర్మ (కాశిబాబు) బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోవులంక పుష్కర ఘాట్ వద్ద ఇటీవల నలుగురు యువకులు గోదావరిలో స్నానానికి దిగి మృత్యువాత పడిన నేపథ్యంలో వారి ఆత్మకు శాంతి కలగాలని అక్కడే దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. తన గురువర్యులు ఆశీర్వాదంతో పొందిన ఉపాసనా మంత్ర జపాన్ని గ్రహణం పట్టు సమయం నుంచి విడుపు సమయం వరకూ నీటిపై తేలియాడుతూ ఆ యువకులకు ఉత్తమగతులు పొందేలా ఆ దేవున్ని ప్రార్థిస్తూ ఈ దీక్ష చేయనున్నట్లు కాశిబాబు వివరించారు.

అభివృద్ధికి చిరునామాగా కాకినాడ



6వ డివిజన్‌లో అభివృద్ధి పనుల్లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రహదారి, డ్రైన్ పనులకు శంకుస్థాపన

కాకినాడ: అభివృద్ధికి చిరునామాగా కాకినాడ నగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక 6వ డివిజన్ కలరా పాకల ప్రాంతంలో రూ.90 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రైన్ల పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. నగర పరిధిలో దాదాపు అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు ఇతర మౌలిక వసతుల కల్పన దాదాపు పూర్తయ్యిందన్నారు. పలు డివిజన్లలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. అక్కడక్కడ మిగిలి ఉన్న కొద్దిపాటి పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని, డిసెంబర్ చివరి కల్లా నూరు శాతం పనులు పూర్తి కావాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చగలగడం ఎంతో సంతోషంగా భావిస్తున్నానన్నారు. పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉండటం వల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి హామీలు ఇచ్చి, పరిష్కరించ గలుగుతున్నామని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. ఇటువంటి సీఎంను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, డివిజన్ ఇన్‌చార్జి కొంతం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొర్రిపూడిలో సురక్ష వైద్య శిబిరం



గొర్రిపూడిలో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న అధికారులు, నాయికులు

కరప: మండలంలోని గొర్రిపూడిలో బుధవారం సర్పంచ్ కె.రమాదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులు 420 మంది పేర్లను నమోదు చేయించుకోగా మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ తదితరులు వారికి పరీక్షలు చేసి, మందులు రాసిచ్చారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పౌష్టికాహార స్టాల్స్ నిర్వహించి, గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు కలిసి కేస్‌షీట్స్ మందులతో కూడిన బ్యాగ్‌లను రోగులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కె.వీరబాబు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర వి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

- నాలుగు రోజులపాటు నిర్వహణ
- కమిషనర్ నాగ నరసింహారావు వెల్లడి

కాకినాడ: నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం నుంచి 28వ తేదీ వరకు 9 ప్రాంతాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, అప్డేట్ చేసుకోవడానికి మాత్రమే ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం చేయడంతో పాటు బయోమెట్రిక్ అప్డేట్ (ఫోటో-ఐరిష్-వేలిముద్ర), పేరు, పుట్టిన తేదీలలో మార్పులు, చిరునామాలో మార్పుల వంటి సేవలను అందిస్తారన్నారు. నగర పరిధిలో కృష్ణానగర్ 2ఏ, డైరీఫారం 11ఏ, గోలీలపేట 14ఏ, యానాం రోడ్డు 15ఏ, చిన్న మార్కెట్ 21ఏ, యాళ్ల వారి వీధి 28బి, బ్యాంకుపేట 32ఏ, గాంధీనగర్ 38ఏ, గైగోలుపాడు 50బి సచివాలయాల పరిధిలో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

అమ్మ దయతో మంచి జరగాలి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి




అమ్మవారి ఆలయాన్ని దర్శించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అమ్మవారి కరుణా కటాక్షాలతో ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం రాత్రి ఆయన ఏటిమొగలోని మల్లారమ్మ, నూకాలమ్మ ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఆలయాల వద్ద నిర్వహించిన అమ్మవారి ఉత్సవాలను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడికి ఏటిమొగ ప్రాంత పెద్దలు, స్థానిక ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటిమొగ ప్రాంతం అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ భీమరాజు, మీసాల దుర్గాప్రసాద్, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, స్థానిక నాయకులు పాలెపు రవి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ నిమజ్జనోత్సవం

బోట్‌క్లబ్: దసరా మహోత్సవాలు ముగియడంతో నగరంలో పలు ప్రాంతాల్లో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. తొలుత ఆయా ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను యువత నృత్యాలతో, తీన్‌మార్ డ్యాన్స్‌లతో ఊరేగించారు. స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి సమీపంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాన్ని స్థానిక అశోక్‌నగర్, విద్యుత్‌నగర్, నాస్సీ స్ట్రీట్, భగవతి మార్గ్ తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో నెలకొల్పిన అమ్మవారి విగ్రహాన్ని రిక్షాపై ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు.

వేంకటేశ్వరునిగా ఐశ్వర్యాంబిక



కాకినాడ రూరల్: విజయ దశమి వేడుకలు ముగియడంతో రమణయ్యపేట శ్రీపీఠంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామిగా ఐశ్వర్యాంబిక అమ్మవారు బుధవారం రాత్రి భక్తులకు దర్శనం ఇచ్చారు. పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామిజీ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహించి, ఆ అన్నంతో మధ్యాహ్నం అన్నదానం చేశారు. దేవీ శరన్నవరాత్రి వేడుకలను విజయవంతం చేసిన భక్తులందరికీ అమ్మవారు ఆశీస్సులు ఉంటాయని పరిపూర్ణానంద స్వామి అన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి జయప్రకాష్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే తిరుమాని సత్యలింగ నాయకర్ కుమారుడు స్వామి నాయకర్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వామి నాయకర్, కుటుంబ సభ్యులతో కలసి కుమార్తెను చూసేందుకు ఈనెల 14న కెనడా వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు మెయిన్ గేట్ బద్దలు కొట్టి లోపలికి చొరబడి బీరువాలోని నగదు, బంగారు, వెండి ఆభరణాలు దోచుకుపోయారు. బుధవారం ఉదయం ఇంటి తలుపు తెరిచి ఉండడాన్ని పక్కన ఉంటున్న వారు గమనించి స్వామి నాయకర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన విదేశంలో ఉండడంతో డి.దేవరాజు ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం ఎస్సై దేవ సుధ కేసు నమోదు చేశారు. చోరీ అయిన ఇంటిలో ఆధారాలను క్లూస్ టీమ్ సేకరించింది. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై దేవసుధ పరిశీలించారు. నగదు ఎంత అనేది పూర్తిగా బాధితుడు వస్తేగా తెలియదని, బంగారు ఆభరణాలు రెండు కాసులు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.